మరో నేతన్న బలవన్మరణం

- ఏడు నెలలుగా ఉపాధి కరువు
- భారంగా మారిన కుటుంబ పోషణ
- కూతురికి వివాహంతో మరింత అప్పు
- తీర్చేమార్గం లేక పరమేశ్ ఆత్మహత్య
- గద్వాల జిల్లా అయిజలో ఘటన

అయిజ, జూలై 23: ఏడు నెలలుగా ఉపాధి కరువై.. అప్పులు భారమై ఓ నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన జోగుళాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అయిజ పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన కాకె పరమేశ్(52) చేనేత మగ్గంపై చీరలు నేస్తూ జీవనం సాగించేవాడు. చిన్ననాటి నుంచే నేత వృత్తినే కొనసాగిస్తున్నాడు. 7 నెలలుగా చేనేత కార్మికులకు చేతినిండా పని లేకపోవడంతో కుటుంబం గడవడం గగనమైంది. నేసిన చీరలకు గిరాకీ లేక.. బట్టల దుకాణ యజమానుల నుంచి చీరలు నేసేందుకు ఆర్డర్లు రాకపోవడంతో అప్పులు చేయక తప్పలేదు. దీనికితోడు ఏడాది కిందట కూతురి వివాహం చేసి మరింత ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాడు. కల్యాణలక్ష్మి సాయానికి దరఖాస్తు చేసుకున్నా ఇంకా మంజూరు కాలేదు. కుటుంబం గడవక.. అప్పులు తీర్చే మార్గంలేకపోగా సోమవారం రాత్రి డబ్బుల కోసం భార్యాభర్తలు గొడవపడ్డారు. తీవ్ర మనోవేదనకు గురైన పరమేశ్ అర్ధరాత్రి మరో గదిలోకి వెళ్లి ఐరన్ పైపునకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడికి భార్య భారతి, కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై విజయ్ భాస్కర్ తెలిపారు. తమను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు. కాగా పరమేశ్ పదోతరగతి బ్యాచ్ మిత్రులు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు.

పరమేశ్ (ఫైల్)

● సిరిసిల్లలో నేతన్నల వంటావార్పు

వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని నేతన్నలు విమర్శించారు. సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రోడ్డుపైనే వంటావార్పుతో నిరసన చేపట్టారు. ఈ నెల 26లోగా సమస్యను పరిష్కరించకపోతే వేలాది మంది కార్మికులతో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. –రాజన్న సిరిసిల్ల నమస్తే తెలంగాణ

కుటుంబ కలహాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

రామచంద్రాపురం, జూలై 23: కుటుంబ కారణాలతో మనస్తాపం చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంగళవారం సంగారెడ్డి జిల్లా కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో చోటుచేసుకున్నది. సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన నర్సింగ్‌రావు కుటుంబంతో కలిసి బీహెచ్ఈఎల్‌లోని విద్యుత్‌నగర్‌లో ఉంటున్నారు. ఆయన కుమారుడు సాయికిరణ్ (28) విప్రోలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో తీవ్రంగా మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం కుటుంబసభ్యులు ఇంటికి వచ్చి చూసే సరికి సూసైడ్ నోట్ రాసి, విగత జీవిగా వేలాడుతూ కన్పించాడు. కొల్లూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి తల్లి మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు.

బొగతలో మునిగి యువకుడి మృతి

వాజేడు/కాశీబుగ్గ, జూలై 23 : ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతంలో మునిగి యువకుడు మృతి చెందాడు. వరంగల్ జిల్లా ఏనుమాముల మార్కెట్ సుందరయ్య నగర్‌కు చెందిన బొనగాని జశ్వంత్ (19) తన స్నేహితులతో కలిసి మంగళవారం బొగత జలపాతం చూడటానికి వచ్చారు. ముగ్గురు స్నేహితులు కలిసి జలపాతం ముందు ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో దిగడంతో వరద ఉధృతికి కొట్టుకుపోతుండటంతో గమనించిన రెస్క్యూ టీం సిబ్బంది ఇద్దరిని బయటకు లాగే లోపు జశ్వంత్ నీట మునిగి ప్రాణాలు కోల్పోయాడు.


జశ్వంత్ (ఫైల్)

పటాన్‌చెరులో కోటి సైబర్ మోసం

పటాన్‌చెరు, జూలై 23: స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఓ వ్యక్తి కోటి రూపాయలు మోసపోయాడు. ఈ ఘటన మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో వెలుగుచూసింది. స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్ట్ చేస్తే అధిక మొత్తంలో లాభాలు వస్తాయని నాడియ కామి అనే మహిళ అకౌంట్ నుంచి పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏపీఆర్ గ్రాండియో గేటెడ్ కమ్యూనిటీలో నివాసముండే బెజవాడ నాగార్జున (36)కు వాట్సాప్ మెసేజ్ వచ్చింది. దీంతో నాగార్జున రూ.99.78 లక్షలు ఆమె చెప్పిన విధంగా ఇన్వెస్ట్ చేశాడు. తర్వాత మోసపోయానని గ్రహించిన ఆయన 1930 నంబర్‌కు ఫోన్ చేసి, పటాన్‌చెరు పోలీసులను ఆశ్రయించాడు. తక్షణమే పోలీసులు ఫ్రాడ్ స్టార్స్ అకౌంట్లను తనిఖీ చేసి రూ.34 లక్షలు ఉన్నట్టు గుర్తించి ఆ ఖాతాలను ఫ్రీజ్ చేయించారని పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

గురుకులం విద్యార్థి ఆత్మహత్య

గుండాల, జూలై 23: పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందనే భయంతో ఓ విద్యార్థి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం రోళ్లగడ్డలో మంగళవారం జరిగింది. రోళ్లగడ్డ అజ్మీరా వీరు, అరుణ కుమారుడు సుధీర్(10) గుండాల గురుకులంలో 6వ తరగతిలో చేరాడు. అక్కడ ఉండలేక సోమవారం ఇంటికొచ్చాడు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పనులకు వెళ్లగా.. భయంతో ఇంట్లో పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ సుధీర్ మృతిచెందాడు.

కరెంట్ షాక్‌తో రైతు మృతి

నర్సింహారావు (ఫైల్)

రఘునాథపాలెం, జూలై 23 : నీళ్ల కోసం మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్తు షాక్ తగిలి యువ రైతు మృతిచెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఈర్లపూడి గ్రామానికి చెందిన యువ రైతు ముత్తంశెట్టి నర్సింహారావు (27) తనకున్న రెండెకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేశాడు. వర్షం కాస్త తెరిపినివ్వడంతో చేనులో కలుపు మందు కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నీళ్ల కోసం బోర్ వద్ద మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. నర్సింహారావుకు ఏడాదిన్నర క్రితమే పెండ్లి కాగా.. భార్య, ఆరు నెలల పాప ఉన్నారు. ఇంటి వద్ద అప్పుడే కుమార్తెను ఆడించి వెళ్లిన నర్సింహారావు అంతలోనే కరెంట్ షాక్‌తో మృతిచెందినట్టు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం పీకలగుండంలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా

పీకలగుండంలో తాగునీటి సరఫరా

ట్యాంకర్‌తో నీరు తెప్పించిన డీఎల్పీవో

నమస్తే ఎఫెక్ట్

దహెగాం, జూలై 23: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం పీకలగుండం గ్రామంలో 'మిషన్ భగీరథ నీళ్లు రాక భగీరథ ప్రయత్నం' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రవాగు దాటి చెలిమ నుంచి గ్రామస్థులు నీళ్లు తెచ్చుకుంటున్న విషయాన్ని తెలుసుకొని డీఎల్పీవో సురేశ్‌బాబు గ్రామాన్ని సందర్శించారు. ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి సరఫరా చేయించారు. రెండు రోజుల్లో మిషన్ భగీరథ నీళ్లు వస్తాయని, కొత్త మోటర్ తెప్పించి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తామని డీఎల్పీవో తెలిపారు. అప్పటి వరకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. వాగులోకి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. వాగులోకి వెళ్లకుండా చీరలతో కంచె ఏర్పాటు చేయించారు. పీకలగుండం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'నమస్తే తెలంగాణ'కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కేకే పిల్లల స్థలాల క్రమబద్ధీకరణకు రూల్స్ ఎలా ఉల్లంఘిస్తారు?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ ఎంపీ కే కేశవరావు కుటుంబసభ్యులకు చెందిన స్థలాల క్రమబద్ధీకరణలో నిబంధనల ఉల్లంఘన ఎలా జరిగిందని హైకోర్టు ప్రభుత్వాన్ని నిలదీసింది. దీనికి సంబంధించి ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నించింది. బంజారాహిల్స్ స్లమ్ ఏరియాల్లో కేశవరావు కొడుకు కే వెంకటేశ్వరరావుకు 1161 గజాల స్థలాన్ని, కుమార్తె, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి 425 గజాల స్థలాన్ని క్రమబద్ధీకరణ చేయడాన్ని సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్‌కు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రతివాదులైన రెవెన్యూ, మున్సిపల్ శాఖల ముఖ్యకార్యదర్శులు, సీసీఎల్ఏ, హైదరాబాద్ కలెక్టర్, షేక్‌పేట్ తహసిల్దార్‌తోపాటు కే వెంకటేశ్వరరావు, గద్వాల్ విజయలక్ష్మి, కవితారావుకు నోటీసులు జారీచేసింది. కవితారావుకు చెందిన 425 గజాల స్థలానికి గద్వాల్ విజయలక్ష్మి జీపీఏ హోల్డర్‌గా ఉన్నారు. నామమాత్రపు ధరతో స్థలాలను క్రమబద్ధీకరించడంపై కౌంటర్లు దాఖలు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. కేకే కుటుంబసభ్యులకు చెందిన స్థలాలను క్రమబద్ధీకరిస్తూ వెలువడిన జీవో 56ను సవాలు చేస్తూ సిద్దిపేట జిల్లా కొండపాకకు చెందిన జీ రఘువీర్‌రెడ్డి పిల్ దాఖలు చేశారు. వెంకటేశ్వరరావుకు 1998 నాటి మార్కెట్ విలువ ప్రకారం చదరపు గజం రూ.2500గా నిర్ణయించి ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేయడం చెల్లదని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. కవితారావు తరపున విజయలక్ష్మికి చెందిన 425 చదరపు గజాల స్థలాన్ని గజం రూ.350 చొప్పున క్రమబద్ధీకరణకు వెలువడిన జీవోను కూడా రద్దు చేయాలని కోరారు. కేకే పిల్లలు 1998లో దరఖాస్తు చేసుకుంటే అప్పటి ధర ప్రకారం క్రమబద్ధీకరణ చేయడం చెల్లదని, క్రమబద్ధీకరణ చేసిన 2023లో గజం స్థలం రూ.50 వేలు ఉన్నదని, ఈ ధర ప్రకారం చేయాలని చెప్పారు. నామమాత్రపు ధరకు క్రమబద్ధీకరణ చేయడం వల్ల ప్రభుత్వానికి రూ.9.25 కోట్లకుపైగా నష్టం వచ్చిందని తెలిపారు.

సుప్రీంకోర్టు స్పష్టత కోరవచ్చు కదా?

- పార్టీ ఫిరాయింపులపై ఇరుపక్షాలకు హైకోర్టు సూచన

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలనే వివాదంపై సుప్రీంకోర్టు నుంచి స్పష్టత కోరవచ్చు కదా? అని వాదప్రతివాదులకు హైకోర్టు సూచించింది. స్పీకర్‌కు కోర్టులు ఆదేశాలు జారీ చేయాలో లేదో అనే వ్యవహారంపై భిన్నమైన తీర్పులు ఉన్న నేపథ్యంలో సుప్రీంకోర్టును ఎందుకు ఆశ్రయించకూడదని ప్రభుత్వంతోపాటు పిటిషనర్లను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. ఖైరతాబాద్, స్టేషన్ ఘన్‌పూర్, భద్రాచలం నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ తరపున గెలుపొంది కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన కేసుల విచారణ గురువారానికి వాయిదా పడింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గెలిచిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావుపై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఉత్తర్వులు ఇవ్వాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, ఇతరులు వేర్వేరుగా వేసిన వ్యాజ్యాలపై మంగళవారం జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు ఆగస్టు 20కి వాయిదా

హైదరాబాద్, జూలై 23 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఇప్పటికే పోలీస్ కమిషనర్ వేసిన కౌంటర్‌లోని విషయాలను అన్వయించుకోబోమని స్పష్టం చేసింది. ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ (సస్పెన్షన్) భుజంగరావు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లను కూడా ట్యాపింగ్ చేసినట్టు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతున్నది. విచారణను ఆగస్టు 20కి వాయిదా వేస్తున్నట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ప్రకటించింది. ఈ కేసులో అధికారాలన్నీ హోం శాఖ కార్యదర్శికే ఉన్నందున ఆయన కౌంటర్ వేస్తారని ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్‌ఖాన్ చెప్పారు. కేంద్రం తరపున కూడా కౌంటర్ వేస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహశర్మ చెప్పారు.

హరీశ్‌రావు చేయించారంటూ..

తన ఫోన్‌ను బీఆర్ఎస్ నేత టీ హరీశ్‌రావు ట్యాపింగ్ చేయించారని గత అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నుంచి బీఎస్పీ తరపున పోటీ చేసి ఓడిపోయిన చక్రధర్‌గౌడ్ దాఖలుచేసిన పిటిషన్‌ను జస్టిస్ బీ రెడ్డి మంగళవారం విచారించారు. జూన్ 19న డీజీపీకి వినతి పత్రం ఇచ్చినా చర్యలు తీసుకోలేదనే పిటిషన్‌పై ప్రభుత్వ వివరణ నిమిత్తం విచారణ ఆగస్టు 6కు వాయిదా వేశారు.

26న ప్రభాకర్‌రావు అరెస్టుకు డెడ్‌లైన్!

నాంపల్లి కోర్టులు, జూలై 23 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌కుమార్‌ను ఈ నెల 26న కోర్టు ఎదుట హాజరుపర్చాలని 12వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఈశ్వరయ్య మంగళవారం ఆదేశించారు. వీరిద్దరిపై వారెంట్ పెండింగ్‌లో ఉన్నదని, తక్షణం అరెస్టు చేసి కోర్టుకు తీసుకురావాలని అధికారులకు డెడ్‌లైన్ విధించారు. క్యాన్సర్, గుండె, మూత్రాశయ వ్యాధులతో బాధపడుతున్నట్టు, అమెరికా నుంచి ప్రయాణం చేయడం మంచిది కాదని డాక్టర్లు తెలిపినట్టు ప్రభాకర్‌రావు విచారణ అధికారికి లేఖ రాశారు. దీంతో 26న నిందితులను హాజరుపర్చడం పోలీసులకు కత్తిమీద సాముగా మారింది.

షార్క్ చేపల్లో కొకైన్!

రియో డీ జనీరియో, జూలై 23: బ్రెజిల్‌లోని రియో డీ జనీరో సరిహద్దు నీటి వనరుల్లోని షార్క్ చేపల్లో కొకైన్ గుర్తించటం సంచలనం రేపింది. దీని ప్రభావంతో వాటి వ్యవహారశైలిలో మార్పులు వస్తున్నాయని, విచిత్రంగా ప్రవర్తిస్తున్నాయని శాస్త్రవేత్తలు తేల్చారు. వాటి కండరాల్లో సాధారణ మోతాదు కన్నా 100 రెట్లు అధికంగా కొకైన్ ఆనవాళ్లు ఉన్నట్టు గుర్తించారు. అయితే, వీటికి కొకైన్ ఎక్కడి నుంచి వస్తున్నదో తెలియక తలలు పట్టుకుంటున్నారు. అక్రమంగా డ్రగ్స్ తయారు చేస్తున్న ల్యాబ్‌ల నుంచి నీటిని నీటి వనరుల్లోకి వదలటం వల్ల, ఆ నీటిని తాగటంతో షార్క్‌ల శరీరంలో కొకైన్ చేరుతున్నదన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే షార్క్‌లలో కొకైన్ స్థాయిలు అత్యధికంగా ఉన్నాయని, పరిస్థితి ఇలాగే కొనసాగితే.. వాటి కంటి చూపు మందగించి, వేటాడే శక్తిని కోల్పోతాయని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు.

కెనడాలో హిందూ ఆలయంపై మళ్లీ దాడి!

టొరొంటో, జూలై 23: కెనడాలో హిందూ దేవాలయాలపై లక్షిత దాడులు మళ్లీ మొదలయ్యాయి. ఇక్కడి ఎడ్మాంటన్‌లోని 'బీఏపీఎస్' స్వామి నారాయణ్ మందిరంలో కొంతమంది దుండగులు మళ్లీ విధ్వంసానికి పాల్పడ్డారు. దేవాలయం గోడలపై రంగులు జల్లారు. విద్వేషపూరిత వ్యాఖ్యల్ని రాశారు. మంగళవారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనను కెనడా హౌజ్ ఆఫ్ కామన్స్ సభ్యుడు రాండీ బోయిసోనాల్ట్ ఖండించారు. వేర్పాటువాద గ్రూపుల కార్యకలాపాలపై కెనడాలో ఆందోళన వ్యక్తమవుతున్నది. కెనడాలో హిందువులను టార్గెట్ చేసుకుంటూ పెరుగుతున్న విద్వేషపూరిత దాడులపై ఆ దేశ పార్లమెంట్ సభ్యుడు చంద్ర ఆర్య ఆందోళన వ్యక్తం చేశారు.

ఇథియోపియాలో విరిగిన కొండచరియలు

157 మంది మృతి

అడిస్ అబాబా: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇథియోపియాలోని చెంచో షాఖా గోజ్జి జిల్లాలో కొండచరియలు విరిగిపడి 157 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యల్లో ఉండగా మరోమారు కొండచరియలు విరిగి పడడంతో ప్రాణ నష్టం పెరిగింది. సోమవారం 55గా ఉన్న మృతుల సంఖ్య మంగళవారానికి ఏకంగా 157కు చేరుకుంది.

నీట్ రీటెస్ట్ అక్కర్లేదు

- మరోసారి నీట్ యూజీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదు
- దేశవ్యాప్త లీకేజీకి ఆధారాలు లేవు
- కేవలం రెండు కేంద్రాల్లోనే లీకేజీ
- మళ్లీ పరీక్ష అంటే 24 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం
- నీట్ రద్దు, రీటెస్ట్ పిటిషన్లు కొట్టివేత
- సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ, జూలై 23: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ లీకేజీ కేసులో సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. నీట్ యూజీ పరీక్షను మరోసారి నిర్వహించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా ప్రశ్నాపత్రం లీకైందని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. పాట్నా, హజారీబాగ్‌లలో మాత్రమే పేపర్ లీక్ అయిందని పేర్కొన్నది. నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశిస్తే, గతంలో పరీక్ష రాసిన దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులపై ప్రభావం చూపుతుందని అభిప్రాయపడింది. ఈ మేరకు మే 5న నిర్వహించిన నీట్ యూజీ–2024 పరీక్షను రద్దు చేయాలని, మరోసారి పరీక్ష నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేడీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం కొట్టివేసింది.

మళ్లీ పరీక్షతో పలు ప్రతికూలతలు

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) సమర్పించిన డాటా, ఐఐటీ మద్రాస్ ఇచ్చిన నివేదికను కోర్టు క్షుణ్ణంగా పరిశీలించిందని, దేశవ్యాప్తంగా పెద్దయెత్తున పేపర్ లీకేజీ జరిగిందనే దానికి ఆధారాలు కనిపించలేదని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. ' నీట్ పరీక్ష ఫలితం దెబ్బతిన్నట్టు లేదా పరీక్ష సమగ్రత దెబ్బతిన్నట్టు ఒక నిర్ణయానికి వచ్చేందుకు తగిన ఆధారాలు లేవు' అని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి మళ్లీ నిర్వహించడం వల్ల అడ్మిషన్ షెడ్యూల్‌కు అంతరాయం కలుగుతుందని, వైద్య విద్య కోర్సులపై ప్రభావం పడుతుందని, భవిష్యత్తులో క్వాలిఫైడ్ మెడికల్ నిపుణుల అందుబాటును దెబ్బతీస్తుందని, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులకు నష్టం చేకూరుస్తుందని కోర్టు అభిప్రాయపడింది.

155 మందికి ప్రత్యక్షంగా లబ్ధి

పాట్నా, హజారీబాగ్‌లలో మాత్రమే నీట్ పేపర్ లీకైందన్న విషయంలో ఎలాంటి వివాదం లేదని, ఆయా కేంద్రాల్లో పరీక్ష రాసిన 155 మంది విద్యార్థులు ప్రశ్నాపత్రం లీకేజీ నుంచి ప్రత్యక్షంగా లబ్ధి పొందారని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ మేరకు సీబీఐ నివేదికను ప్రస్తావించింది. పేపర్ లీక్‌లో ఎక్కువ సంఖ్యలో లబ్ధిదారుల ప్రమేయం ఉన్నట్టు సీబీఐ దర్యాప్తులో తేలితే, వారిపై చర్యలు తీసుకుంటామని న్యాయస్థానం ఈ సందర్భంగా స్పష్టం చేసింది. నీట్ పరీక్షలో వివాదాస్పదమైన ప్రశ్నకు సంబంధించి 'ఆప్షన్ 4' సరైనదని ఐఐటీ ఢిల్లీ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో.. అందుకు అనుగుణంగా ఫలితాలను సవరించాలని సీజేఐ ఎన్టీఏను ఆదేశించారు.

ఆ నీట్ ప్రశ్నకు ఒక్కటే సమాధానం!

నీట్ యూజీ–2024 పరీక్షలో అడిగిన ఒక వివాదాస్పద ఫిజిక్స్ ప్రశ్నకు సరైన సమాధానంపై ఢిల్లీ ఐఐటీ నిపుణుల కమిటీ మంగళవారం సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది. ఆ ప్రశ్నకు సరైన సమాధానం ఒక్కటేనని స్పష్టం చేసింది. సంబంధిత ప్రశ్నకు ఇచ్చిన ఆప్షన్లలో నాలుగోది మాత్రమే సరైన సమాధానం అని ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీ తేల్చిందని ధర్మాసనం తెలిపింది. 'స్టేట్‌మెంట్ 1 కరెక్ట్.. స్టేట్‌మెంట్ 2 కరెక్ట్ కాదు' అని ఆ నాలుగో ఆప్షన్ చెబుతున్నదని పేర్కొన్నది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కూడా 4వ ఆప్షన్‌నే సరైన సమాధానంగా ఆన్సర్ కీలో సవరించాలని తెలిపింది. ప్రశ్న నంబర్ 29కు నాలుగో ఆప్షన్ మాత్రమే సరైన సమాధానమని తేల్చిన నేపథ్యంలో నాలుగు లక్షల మందికి పైగా అభ్యర్థులు నాలుగు మార్కులు కోల్పోనున్నారు.

అసాధారణ పరిస్థితుల్లో తప్ప బెయిల్‌ను అడ్డుకోవద్దు

హైకోర్టులకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 23: ట్రయల్ కోర్టులు జారీ చేసిన బెయిల్ ఉత్తర్వులపై అసాధారణమైన పరిస్థితుల్లో తప్ప హైకోర్టులు స్టే విధించరాదని సుప్రీంకోర్టు ఆదేశించింది. హవాలా కేసులో నిందితునికి మంజూరైన బెయిల్‌పై హైకోర్టు విధించిన స్టే ఉత్తర్వులను సుప్రీంకోర్టు మంగళవారం తొలగించింది. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ.. అసాధారణమైన పరిస్థితుల్లో మాత్రమే హైకోర్టులు బెయిల్‌పై స్టే విధించాలని పేర్కొన్నారు. 'బెయిల్‌పై స్టే విధించే అధికారం కోర్టులకు ఉండవచ్చు. కానీ అసాధారణమైన పరిస్థితుల్లో మాత్రమే ఆ అధికారాన్ని వినియోగించాలి. సాధారణమైన పరిస్థితుల్లో బెయిల్‌ను అడ్డుకోరాదు' అని అన్నారు. ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై సరైన కారణాలు తెలుపకుండానే ఢిల్లీ హైకోర్టు స్టే విధించడంపై సుప్రీంకోర్టు ఈ నెల 11న అసంతృప్తి వ్యక్తంచేసింది. గత ఏడాది జూన్‌లో మంజూరైన బెయిల్‌పై ఏడాది కాలంగా ఎందుకు స్టే విధించారని ప్రశ్నించింది. ఈ కేసులో వ్యక్తి స్వేచ్ఛను ఉల్లంఘించారంటూ సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తంచేసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు మంజూరుచేసిన బెయిల్‌పై ఢిల్లీ హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.

గ్యాంగ్‌స్టర్‌తో పారిపోయిన ఐఏఎస్ భార్య

- తిరిగి భర్త ఇంటి వద్దకు వచ్చి..ఆత్మహత్య
- మృతదేహాన్ని తీసుకోవడానికి నిరాకరించిన ఐఏఎస్

గాంధీనగర్, జూలై 23: తొమ్మిది నెలల క్రితం గ్యాంగ్‌స్టర్‌తో పారిపోయిన ఐఏఎస్ భార్య, మళ్లీ తన భర్త ఇంటి ముందుకు వచ్చి.. తనను ఇంట్లోకి రానివ్వాల్సిందిగా కోరింది. భర్త నిరాకరించటంతో.. ఇంటి బయట విషం తాగి ఆత్మహత్యా యత్నం చేసుకునిఆదివారం మృతిచెందింది. ఈ ఘటన గుజరాత్ గాంధీనగర్ సెక్టార్–19లో చోటుచేసుకుంది. ప్రస్తుతం 'గుజరాత్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్' కార్యదర్శిగా పనిచేస్తున్న రంజిత్ కుమార్ భార్య సూర్య జే (45)పై తమిళనాడులో రెండు క్రిమినల్ కేసులున్నాయి.ఆమె శవాన్ని తీసుకోవడానికి ఆ ఐఏఎస్ భర్త నిరాకరించారు. సూర్య జే, ఆమె ప్రియుడు (గ్యాంగ్‌స్టర్) ఇద్దరూ కలిసి ఓ బాలుడ్ని(14) కిడ్నాప్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. శనివారం తన భర్త ఇంటికి రాగా, భర్త ఆమెను తన ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో అతడి ఇంటి బయట విషం తాగి ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని భర్త తరపు న్యాయవాది చెబుతున్నారు. 2023లోనే వాళ్లిద్దరూ విడిపోయారని చెప్పారు.

సెక్యూరిటీని పిలవండి.. ఆయన్ను బయటకు పంపండి!

- వేరే న్యాయవాది వాదనల సమయంలో కలుగజేసుకొన్న మాథ్యూస్ నెడుంపర
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సీజేఐ

న్యూఢిల్లీ, జూలై 23: నీట్ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, న్యాయవాది మాథ్యూస్ నెడుంపర మధ్య మాటల యుద్ధం నడిచింది. చివరకు 'సెక్యూరిటీని పిలవండి.. ఆయన్ను బయటకు పంపండి' అని సీజేఐ అనేంత వరకు ఈ వివాదం వెళ్లింది. నీట్ పిటిషన్‌దారుల్లో ఒకరి తరపు న్యాయవాది నరేందర్ హూడా వాదనలు వినిపిస్తున్న క్రమంలో తాను మాట్లాడుతానంటూ మధ్యలో కలుగజేసుకొన్న లాయర్ మాథ్యూస్‌పై సీజేఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ కోర్టులో నేను ఒక సీనియర్ న్యాయవాదిని. మాట్లాడేందుకు నాకు అన్ని హక్కులు ఉన్నాయి' అని సమాధానం ఇచ్చారు. దీనిపై కోపగించుకొన్న సీజేఐ 'నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. మీరు గ్యాలెరీ చూసి మాట్లాడకూడదు. నేను ఈ కోర్టు ఇన్‌చార్జిని. సెక్యూరిటీని పిలవండి.. ఆయన్ను బయటకు పంపండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడి నుంచి వెళ్లిపోయిన ఆయన మళ్లీ కోర్టు రూమ్‌లోకి వచ్చి 'సారీ, నేను ఏ తప్పు చేయలేదు. నా పట్ల అనుచితంగా ప్రవర్తించారు' అని అన్నారు. తనను అవమానించినందుకు సీజేఐను క్షమిస్తున్నానని బైబిల్‌లోని ఒక వాక్యాన్ని చదివారు.

ఇదే తొలిసారి కాదు..

మాథ్యూస్ నెడుంపర సుప్రీంకోర్టులో సీజేఐ చంద్రచూడ్‌తో వాగ్వాదానికి దిగడం ఇదే తొలిసారి కాదు. ఈ ఏడాది మార్చిలోనూ ఎలక్టోరల్ బాండ్లపై విచారణ సమయంలోనూ ఆయన అంతరాయం కలిగించారు. అంతకుముందు ఆయనకు మూడు నెలల జైలు శిక్ష విధించిన కోర్టు తర్వాత శిక్షను రద్దు చేసింది.

జన్యుమార్పిడి ఆవాలపై సుప్రీం బెంచ్ భిన్న తీర్పు

న్యూఢిల్లీ, జూలై 23: జన్యుమార్పిడి చేసిన ఆవాలను సాగుకు వినియోగించాలా? వద్దా? అన్న అంశంపై సుప్రీం కోర్టు బెంచ్ భిన్న తీర్పులు వెలువరించింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన డివిజన్ బెంచ్.. జన్యుమార్పిడి చేసిన ఆవాలకు క్లియరెన్స్‌పై విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న.. జన్యుమార్పిడి ఆవాలకు జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ ఆమోదం తెలపటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత దేశ జీవవైవిధ్యం ప్రత్యేకమైనదని.. ఇక్కడ జన్యుమార్పిడి చేసిన ఆవాలతో ఎలాంటి ప్రభావం ఉంటుంది? అన్న దేశీయ అధ్యయనం చేయకుండానే క్లియరెన్స్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తూ ఆమోద ముద్రను వ్యతిరేకిస్తూ తీర్పు ఇచ్చారు. మరో వైపు, జస్టిస్ కరోల్ మాత్రం క్లియరెన్స్‌ను ఆమోదించారు. ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు తీర్పులు ఇవ్వటంతో ఈ అంశంపై సరైన తీర్పు వెలువరించేందుకు విస్తృత ధర్మాసనం ఏర్పాటుకు ఆదేశాలివ్వాలని సీజేఐకి న్యాయమూర్తులు సిఫార్సు చేశారు.

సముద్రం అట్టడుగున డార్క్ ఆక్సిజన్

న్యూఢిల్లీ, జూలై 23: సముద్రం అట్టడుగున డార్క్ ఆక్సిజన్ (దాదాపు 13 వేల అడుగుల లోతున ఉత్పత్తి అయ్యే ఆక్సిజన్‌ను డార్క్ ఆక్సిజన్ అంటారు) ఉత్పత్తి కావటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఎలాంటి జీవి ప్రమేయం లేకుండా, సూర్య రశ్మి పడకుండా పసిఫిక్ మహా సముద్రంలో ప్రాణవాయువు ఉత్పత్తి కావటమే అందుకు కారణం. దీన్ని బట్టి సముద్రపు అడుగు భాగంలో ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేయొచ్చన్న అభిప్రాయం బలపడుతున్నదని స్కాటిష్ అసోసియేషన్ ఫర్ మరైన్ సైన్సెస్ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. 2013లోనే తొలిసారిగా దీన్ని గుర్తించగా, పూర్తి అధ్యయనం తర్వాత ఈ అంశాన్ని ఓ జర్నల్‌లో ప్రచురించారు.



రిమోట్‌తో బ్రెయిన్ కంట్రోల్!

ప్రత్యేక పరికరాన్ని అభివృద్ధి చేసిన దక్షిణకొరియా



సియోల్, జూలై 23: హీరో సూర్య నటించిన 'సెవెన్త్ సెన్స్' సినిమా చూశారా? అందులో విలన్ వశీకరణ విద్యతో ఎదుటివారి మెదడుని ఆధీనంలోకి తీసుకొని కండ్లతోనే ఆడిస్తాడు. ఇలాంటివి సినిమాలు, కథల్లోనే సాధ్యమని ఇప్పటివరకూ అనుకొన్నాం. అయితే, నిజ జీవితంలోనూ అవతలి వ్యక్తి మెదడును నియంత్రించవచ్చని దక్షిణ కొరియాకు చెందిన కొరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బేసిక్ సైన్స్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఎలాగంటే?

ఎదుటి వ్యక్తుల మెదళ్లను ఆధీనంలోకి తీసుకోవడానికి టీవీ రిమోట్ లాంటి ప్రత్యేక పరికరం అవసరమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. తాము అభివృద్ధి చేసిన ప్రత్యేక పరికరంలోని అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించి మెదడును వశం చేసుకోవచ్చని అంటున్నారు. బ్రెయిన్ మాడ్యులేటింగ్ టెక్నాలజీ సాయంతో సృష్టించే ఈ ప్రత్యేక తరంగాలు మెదడుతో అనుసంధానమై.. రిమోట్ ద్వారా ఇచ్చే ప్రత్యేక కమాండ్‌లను నెరవేరుస్తాయని చెప్తున్నారు. ఎలుకలపై చేసిన ప్రయోగం విజయవంతమైందని, త్వరలో మనుషుల మీద కూడా ఈ తరహా ప్రయోగాలు చేయనున్నట్టు వెల్లడించారు.

ఏ రంగాల్లో వినియోగిస్తారంటే?

'మ్యాగ్నెటో–మెకానికల్ జెనెటిక్స్'గా పిలుస్తున్న ఈ టెక్నాలజీని మెదడు పనితీరు, ఆర్టిఫిషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్, టూ వే బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ టెక్నాలజీస్, నాడీ సంబంధ వ్యాధుల నిర్ధారణలో ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.